
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జనగామ

శుక్రవారం 5 ఏప్రిల్ 2024

గురువారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 40.5°C | కనిష్ఠం : 24.0°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.35 గం.

సహర్ : శనివారం ఉ : 4.44 గం.



ఎండ వేడితో నిర్మానుష్యంగా మారిన జనగామ చౌరస్తా

భగభగ..

రారెత్తిస్తున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి

- ఉమ్మడి జిల్లాలో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- ములుగు, మహబూబాబాద్ జిల్లాలో అత్యధికం
- బొగ్గుగని ప్రాంతాల్లో మరింత వేడిమి
- ఆరెంజ్ అలర్ట్ జారీతో యంత్రాంగాలు అప్రమత్తం

హనుమకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎండలు భగభగమంటున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం, సగటున 40డిగ్రీలకు పైనే నమోదవుతుండటం, వడగాలులు, ఉక్కపోత ప్రారంభం కావడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటలకే సూరీడు సుర్రుమంటుండగా.. మధ్యాహ్నం సమయంలో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కూడళ్ల వెలవెలబోతున్నాయి. గతేడాది కన్నా ఈ సారి ఎండలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా.. మార్చిలో పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 38 డిగ్రీలు నమోదవగా.. ఏప్రిల్‌లో తీవ్రత పెరుగుతూ వస్తోంది. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక ప్రగటి ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరుకుంది. అత్యధికంగా ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 42.1 డిగ్రీలు నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 41డిగ్రీలు, జనగామ జిల్లాలో 40.5డిగ్రీలు, వరంగల్ జిల్లాలో 40.3 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలో కాస్త తక్కువగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో ములుగులో మరింతగా 42.9 డిగ్రీలు, 42.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 42.6 డిగ్రీలు, జనగామలో 41.6 డిగ్రీలు, వరంగల్‌లో 41.7 డిగ్రీలు, హనుమకొండలో 41.5 డిగ్రీలకు పెరగొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. ఎండలు పెరుగుతుండటంతో జన సంచారం లేక రోడ్ల పక్కన చిరువ్యాపారాలు మందగించాయి. దీంతో ఆ పేద, చిరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు, మజ్జిగ, అంబలి, సోడ తదితర పానీయాలకు డిమాండ్ పెరిగింది. మరోవైపు వడదెబ్బబారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా బయట పనులకు వెళ్లే కార్మికులు, ఉపాధి కూలీలు ఎక్కువగా అనారోగ్యం పాలవుతున్నారు. ఉష్ణోగ్రతల తీవ్రత వల్ల వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధడుతున్నవారు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ క్రమంలో అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి ఎండబాధితులకు తక్షణ వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.

నిప్పుల కుంపటిగా బొగ్గుగనులు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని బొగ్గుగని ప్రాంతాలైన భూపాలపల్లి టౌన్, తాడిచెర్ల, ఘనపురం మండలంలోని మాధవరావుపల్లె ఓపెన్ కాస్ట్‌లు, వాటి పరిసరాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. సహజంగా బొగ్గునిల్వలు, ఓపెన్‌కాస్ట్‌లు ఉన్న చోట వేడిమి ఎక్కువగా ఉంటుంది. దీనికితోడు ఎండలు మండిపోతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఇలాగే పెరుగుతూ పోతే నీటితో ఈ ప్రాంతాలను చల్లబరచాల్సి ఉంటుంది. అలాగే సిబ్బందికి సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితి వస్తుంది. ఉద్యోగులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. బయట 40 డిగ్రీలు ఉంటే ఓపెన్ క్యాస్ట్‌లలో 45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రత ఉండే అవకాశం ఉండటంతో సంస్థ అధికారులను అప్రమత్తం చేస్తోంది.



సోడా దుకాణం వద్ద రద్దీ

రెండు కార్లు ఢీకొని ఒకరి మృతి

ముగ్గురికి గాయాలు- సింగరాజుపల్లి వద్ద ఘటన



ప్రమాదం ధ్వంసమైన కార్లు

వివరాలు 8లో..

పల్లాను బర్తరఫ్ చేయాలి

ప్లకార్డులతో కాంగ్రెస్ నాయకుల నిరసన



జనగామ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎమ్మెల్యే పల్లాకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేసి అక్రమ పద్ధతిలో గెలవాలని బీఆర్ఎస్ ప్రయత్నించిందని వారు విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు, వ్యాపారస్తులు, సినీతారల ఫోన్లను ట్యాపింగ్ చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్ని భయభ్రాంతులకు గురిచేసినప్పటికీ ప్రజలు చైతన్యంతో కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల తర్వాత కీలకంగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామలోనూ ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. జనగామ, చేర్యాలలో తమ పార్టీ కార్యాలయాలకు సమీపంలోనే బీఆర్ఎస్ కార్యాలయాలను తీసుకొని తమ పార్టీ నేతల ఫోన్లను ట్యాపింగ్ చేశారని అన్నారు. పార్టీ నేతల వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి ప్రజలను, వ్యాపారస్థులను భయపెట్టి దొడ్డిదారిన ఎమ్మెల్యేగా గెలిచారని మండిపడ్డారు. దొంగ ఓట్లతో ఎమ్మెల్యే అయ్యారని విమర్శించారు. ఈ విషయంలో తాము న్యాయపోరాటం చేస్తామని అన్నారు. ఎన్నికల సంఘం విచారణ జరిపి పల్లాపై అనర్హత వేటు వేసి తర్వాతి స్థానంలో ఉన్న కొమ్మూరిని ఎమ్మెల్యేగా ప్రకటించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింగరావు, చెంచారపు బుచ్చిరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, మునిసిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి, వంగాల మల్లారెడ్డి, మేడ శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు బనుక శివరాజ్‌యాదవ్, బొట్ల నర్సింగరావు, కాగితాపురం మహేందర్‌రెడ్డి, ధర్మ గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాదిగల ద్రోహి కాంగ్రెస్ పార్టీ

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ



ఆర్టీసీ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 4: తెలంగాణలో 12 శాతానికి పైగా ఉన్న మాదిగలకు పార్లమెంటు స్థానాల్లో అవకాశం కల్పించకుండా కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. ఈ మేరకు గురువారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్లమెంటు సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. దళితుల్లో 20% గల మాలలకు రెండు సీట్లు కేటాయించి ఊరుకొక్కరు లేని బైండ్ల కులానికి ఒక సీటు ఇచ్చిన రేవంత్‌రెడ్డి 75% మాదిగలకు అన్యాయం చేశారన్నారు. నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, వరంగల్ స్థానాల్లో కాంగ్రెస్‌లో దశాబ్దాల తరబడి సేవ చేస్తూ టికెట్ ఆశించిన మాదిగ నేతలను రాజకీయంగా సమాధి చేశారని మండిపడ్డారు. పదవుల కోసం కండువాలు మార్చే కడియం శ్రీహరికి మందకృష్ణ మాదిగను విమర్శించే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని రెండు పార్లమెంటు స్థానాలను మాదిగలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎంపీ స్థానాల కేటాయింపులో మాదిగలకు అన్యాయం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా 10 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్, రాష్ట్ర నాయకులు చుంచు రాజు, సందెన రవీందర్, తల్లపల్లి కుమార్, బొట్ల మహేష్, ఉదయ్‌కిరణ్, నీర్మాల బాస్కర్, గువ్వల రవి, గుర్రం శ్యాంసన్, అరూరి శ్రీనివాస్, నలిమల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నా ఫోన్‌ను పల్లా ట్యాప్ చేశారు

నా ఇంటికి సమీపంలోనే పల్లా కార్యాలయాలు

ప్రభుత్వం విచారణ చేయాలి

కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జనగామలో మాట్లాడుతున్న కొమ్మూరి

జనగామ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ట్యాపింగ్ చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. జనగామ నియోజకవర్గంలో తమ పార్టీ నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసి ఎమ్మెల్యేగా గెలిచారని ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో జనగామ, చేర్యాలలో తన ఇళ్లకు 100 మీటర్ల దూరంలోనే పల్లా ఆఫీసులు ఏర్పాటు చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసేందుకే తన ఇళ్లకు సమీపంలోనే ఆఫీసులు తెరిచారని, ఎన్నికలు అయిపోగానే ఆఫీసును వేరే చోటకు మార్చాడని అనుమానం వ్యక్తం చేశారు. తాము ఎవరెవరితో మాట్లాడుతున్నామో ట్యాపింగ్ ద్వారా వింటూ తమ నాయకులకు ఆశలు పెట్టి కొన్నారని అన్నారు. ఈ విషయంపై విచారణ చేసి ఆయనపై అనర్హత వేటు వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, పల్లా కలిసి రాష్ట్రంలోని 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 25 వేల నుంచి 30 వేల దొంగ ఓట్లు నమోదు చేయించారని, అదే విధంగా ఫోన్ ట్యాపింగులకు పాల్పడ్డారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో పల్లా ఆస్తులు, ఆదాయాలను సరిగ్గా చూపించలేదని, దీనిపై తాను హైకోర్టులో పిటిషన్ వేశానని, త్వరలోనే విచారణకు వస్తుందని తెలిపారు. ఆర్నెళ్లు, ఏడాదిలోగా కోర్టులో పల్లా బండారం రుజువై ఇంటికి వెళ్లడం ఖాయమని అన్నారు. కేసీఆర్ ఆస్తులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన ఓట్ల కంటే రెట్టింపు ఓట్లను పార్లమెంట్ ఎన్నికల్లో వేయిస్తానని అన్నారు.

తేలిన పట్టభద్రుల లెక్క

జిల్లాలో 23,320 మంది గ్రాడ్యుయేట్స్

తుది జాబితాను విడుదల చేసిన ఈసీ



జనగామ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టభద్రుల లెక్క తేలింది. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల పరిధిలో ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్లకు సంబంధించిన తుది జాబితాను ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఎన్నికల జరగనున్న నేపథ్యంలో ఈసీ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా గత ఏడాది డిసెంబర్ 30 నుంచి పట్టభద్రుల ఓటర్ల దరఖాస్తులను స్వీకరించింది. డిసెంబరు 30 నుంచి ఫిబ్రవరి 23 వరకు దరఖాస్తులను స్వీకరించారు. కాగా.. ఫిబ్రవరి 24 నుంచి ముసాయిదా జాబితాను ఈసీ విడుదల చేసింది. ఇదే క్రమంలో మార్చి 14 వరకు అభ్యంతరాలను స్వీకరించింది. దరఖాస్తులపై వచ్చిన అభ్యంతరాలను మార్చి 29 వరకు అధికారులు పరిష్కరించారు. కాగా.. గురువారం తుది జాబితాను విడుదల చేసింది. జిల్లాలో మొత్తంగా 23,320 మంది పట్టభద్రులు ఉన్నట్లు తేలింది. ఇందులో పురుషులు 14,862, మహిళలు 8457, థర్డ్‌జండర్ ఒకరు(బచ్చన్నపేట మండలంలో) ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కోసం జిల్లావ్యాప్తంగా 27 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు.

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
నర్మెట్ట	1	686	366	1052
తరిగొప్పుల	1	366	192	558
బచ్చన్నపేట	2	1271	716	1988
జనగామ	7	3503	2382	5885
లింగాలఘనపురం	2	1092	583	1675
రఘునాథపల్లి	2	1181	637	1818
స్టేషన్‌ఘన్‌పూర్	3	1237	790	2027
చిల్పూరు	1	741	403	1144
జఫర్‌ఘడ్	2	981	531	1512
పాలకుర్తి	3	1686	809	2495
దేవరుప్పుల	2	1219	642	1861
కొడకండ్ల	1	899	406	1305
మొత్తం	27	14862	8457	23320

పోలీస్ చెక్‌పోస్టుల ఎత్తివేత

జనగామ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులను ఎత్తివేశారు. ఎన్నికల వేళ అక్రమ నగదు, మద్యాన్ని అడ్డుకునేందుకు జిల్లాలోని జనగామ మండలం పెంబర్తి, కొడకండ్ల మండలం మొండ్రాయి, బచ్చన్నపేట మండలం కొన్నె, తరిగొప్పుల మండలం ఎన్యానాయక్‌తండా, లింగాలఘణపురం మండలం జీడికల్, జఫర్‌గడ్ వద్ద ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అయితే తాజాగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు చెక్‌పోస్టులను ఎత్తివేయాలంటూ ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది. దీంతో జిల్లాలో ఆరు చెక్‌పోస్టులను తాత్కాలికంగా ఎత్తివేస్తున్నట్లు డీసీపీ సీతారామ్ తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైన వెంటనే తిరిగి చెక్‌పోస్టులు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

'ఆర్‌బీఎస్‌కే అమలు చేయాలి'

జనగామ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాష్ట్రీయ బాల స్వస్థ(ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ సూచించారు. జిల్లాలో ఆర్‌బీఎస్‌కే అమలు తీరుపై ఆర్‌బీఎస్‌కే బృందాలతో సమీక్ష నిర్వహించారు. అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పిల్లల్లో రక్తహీనత సమస్యలను గుర్తించి పోషకాహారం అందించాలన్నారు. ఆరోగ్య రుగ్మతలు గుర్తించిన పిల్లలకు స్థానిక పీహెచ్‌సీలు వైద్యం అందించాలని, అవసరమైతే ఎంజీఎం ఆసుపత్రికి రెఫర్ చేయాలని అన్నారు. సమావేశంలో వైద్యాధికారులు మహేందర్, రవీందర్, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

వైద్యశాఖ పరిశీలకుడు రవితేజ




సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు రవితేజ

జనగామ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని వైద్యశాఖ రాష్ట్ర పరిశీలకుడు డా.రవితేజ అన్నారు. ఈ విషయమై జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్‌తో పాటు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, అన్ని ప్రైవేటు ఆస్పత్రులతో రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. గతంలో అల్లోపతి వైద్యశాలలకే రిజిస్ట్రేషన్లు జరరగా ప్రభుత్వం కొత్తగా ఆయుర్వేద వైద్యశాలలకు అనుమతిని తప్పనిసరి చేసిందని తెలిపారు. వారంలోగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, తర్వాత ప్రైవేటు ఆస్పత్రులను రిజిస్టర్ చేయించాలన్నారు. అనుమతులు లేని వాటికి ఒకటి, రెండు సార్లు నోటీసులు ఇవ్వాలని, అయినప్పటికీ రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే సీజ్ చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా.హరీశ్‌రాజ్, వైద్యాధికారులు మహేందర్, రవీందర్, అశోక్‌కుమార్, కరుణాకర్‌రాజు, భాస్కర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

రైస్ మిల్లర్లకు కలెక్టర్ ఆదేశాలు



ఓబుల్ కేశ్వాపూర్ రైస్ మిల్లులో సీఎంఆర్ రైస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, ఏప్రిల్ 4: వానాకాలం 2023-24 సీఎంఆర్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. గురువారం ఆయన జనగామ మండలం ఓబుల్ కేశ్వాపురంలోని మహాలక్ష్మీ ఆగ్రో ఇండస్ట్రీస్, ధాన్యమిత్ర రా రైస్ మిల్లులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వానాకాలం దిగుమతి అయిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లర్లకు కేటాయించిన రోజువారీ లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. యాసంగికి సంబంధించిన ధాన్యం నిల్వ చేసేందుకు గోదాముల్లో సరిపడా స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎఫ్‌సీఐకి సీఎంఆర్ బియ్యాన్ని తరలించే విధానాన్ని, గన్నీ సంచుల గురించీ ఆరా తీశారు. పరిశీలనలో ఆయన వెంట డీఎస్‌వో రోజారాణి, డీఎం సీఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కడియం శ్రీహరి, కావ్య

కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన సుమారు వెయ్యి మంది నాయకులు, కార్యకర్తలు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో వారంతా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం కండువా కప్పుకొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో అధిక శాతం బీఆర్ఎస్ తరఫున స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారే ఉన్నారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి, కడియం కావ్య సీఎం రేవంత్‌ను సత్కరించారు.

- స్టేషన్‌ఘన్‌పూర్

గొర్రెల మందపైకి దూసుకుపోయిన కారు

ధర్మసాగర్ (హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : అతివేగంతో కారు గొర్రెల మందపైకి దూసుకుపోవడంతో ఏడు గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన దిన ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామ శివారులో గురువారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం... ధర్మసాగర్‌కు చెందిన గొర్రెలకాపరులు గంటె రమేష్, గంటె సంపత్, గంటె సాంబరాజు, అల్లాడి పెద్దపురం, గంటె పెద్ద కొంరయ్య, చిన్న కొంరయ్యలకు చెందిన గొర్రెలను మేతకు తోలుకుపోయారు. శాయిపేట్ వైపు నుంచి గొర్రెలను మేపుకొని తిరిగి ధర్మసాగర్‌కు వస్తుండగా ఎలుకుర్తి క్రాస్ వద్దకు రాగానే కారు అతివేగంతో వచ్చి గొర్రెల మందపైకి దూసుకుపోయింది. దీంతో ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో తొమ్మిది గొర్రెలకు గాయ్యాలయ్యాయి. కాగా, మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన నిందితులను గొర్రెలకాపరులు పోలీసులకు అప్పగించారు.



ఎలుకుర్తి క్రాస్ వద్ద గొర్రెలపైకి కారు దూసుకుపోవడంతో మృతి చెందిన, గాయపడిన గొర్రెలు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మడికొండ, ఏప్రిల్ 4 : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాజీపేట మండలం మడికొండలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రాజబాబు తెలిపిన వివరాలప్రకారం. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన వస్కుల రాజు (37)కు మడికొండ ఎస్సీ కాలనీలోని రజితతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబంతో మడికొండలో నివాసముంటున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. గతంలో ఆటో నడుపుకునే రాజు కొంతకాలంగా అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నాడు. గతంలో అతను ఒకసారి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. మంగళవారం రాత్రి ఇంట్లో పడుకున్న అతడు ఉదయం వేళ ఇంట్లో వారు లేచి చూసే సరికి ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరి వేసుకుని కనిపించాడు. అతడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వస్కుల రాజు(ఫైల్)



వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

రైలులో బాలుర తరలింపు

పట్టుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించిన పోలీసులు

కాజీపేట, ఏప్రిల్ 4 : రైలులో తరలిస్తున్న బాలకార్మికులను పోలీసులు పట్టుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం. సంజీవరావు తెలిపిన ప్రకారం. గోరఖ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య నడిచే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం వివిధ ప్రాంతాల నుంచి బాలురను తరలిస్తున్నారన్న సమాచారంతో కాజీపేటలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 11 మంది బాలురు, వారిని తరలిస్తున్న ఐదుగురిని పట్టుకున్నారు. విచారించగా వేసవి సెలవులు ఉన్నందున బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌లో పని చేయించేందుకు బాలురలను తరలిస్తున్నట్లు రవాణాదారులు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుకున్న బాలురను చైల్డ్‌లైన్‌కు అప్పగించినట్లు చెప్పారు. తనిఖీలల్లో రైల్వే సీఐ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌కు 5రోజుల వరుస సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 4 : వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా ఐదు రోజులు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం బాబూజగ్జీవన్‌రామ్ జయంతి, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం అమావాస్య సందర్భంగా సెలవు, మంగళవారం ఉగాది పండగను పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు తెలిపారు. బుధవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కార్యదర్శి ఆ ప్రకటనలో కోరారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష తేదీలు ఖరారు

హనుమకొండ టౌన్ / కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4 : ఎంపీఈడీ, బీపీఈడీ పరీక్ష తేదీలను గురువారం కేయూ పరీక్షల విభాగం ప్రకటించింది. ఈనెల 18, 20, 23, 25 తేదీల లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంపీఈడీ మొదటి సెమిస్టర్, ఈనెల 16, 19, 22, 24 తేదీలలో ఎంపీఈడీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు, అదే విధంగా ఈనెల 16, 18, 20, 22 తేదీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు.

ముగిసిన ఇంటర్ స్పాట్

వరంగల్ ఎడ్యుకేషన్ మార్చి 4 : ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ గురువారంతో ముగిసింది. మార్చి 16 నుంచి హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న స్పాట్ క్యాంపు ముగిసిందని క్యాంపు ఆఫీసర్ ఎ.గోపాల్, అదనపు క్యాంపు అధికారి కె. మాధవరావులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జనరల్ విభాగంలో 7.5 లక్షల జవాబు పత్రాలు రాగా, వొకేషనల్ విభాగంలో 1.5 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. వీటన్నింటి మూల్యాంకన ప్రక్రియ పూర్తియ్యిందని తెలిపారు. స్పాట్ క్యాంపులో 361 మంది సీఈలు, 1,838 మంది ఏఈలు, 361 మంది స్క్రూటిని సిబ్బంది పాల్గొన్నట్లు వారు తెలిపారు. మూల్యాంకన ప్రక్రియ పూర్తి కావడంతో మరో పది రోజుల్లో బోర్డు మార్కుల పోస్టింగ్‌ను పూర్తి చేసి ఫలితాలు ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

ఈనెల 12వ తేదీ వరకు నిర్వహణ

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : జేఈఈ మెయిన్స్ పరీక్ష హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమైంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన షిఫ్ట్-1 పరీక్షకు మొత్తం 790 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 716 మంది హాజరు కాగా 74 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 90.63 శాతం మంది విద్యార్థులు మొదటి షిఫ్ట్‌లో హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన రెండవ షిఫ్ట్ పరీక్షకు మొత్తం 790 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 713 మంది హాజరు కాగా 77 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 90.25 శాతంమంది విద్యార్థులు మొదటిషిఫ్ట్‌లో హాజరయ్యారు. కాగా నగరంలోని అయాన్ డిజిటల్ జోన్, ఎర్రగట్టు గుట్ట, నోబుల్ టెక్నాలజీస్, చింతగట్టు, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల బొల్లికుంటలో గురువారం జేఈఈ మెయిన్స్-2024 పరీక్షలు ప్రారంభమయ్యాయి. నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో ఈనెల 12 వరకు రెండు షిఫ్టుల్లో జరిగే పరీక్షకు 8,627 మంది పరీక్ష రాయనున్నారు.

భార్యకు దూరంగా ఉంటున్న భర్తపై దాడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 4 : విడాకుల కేసు కోర్టులో కొనసాగుతోండగానే భార్య కుటుంబసభ్యులు భర్తపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి గురువారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని రాయపురాకు చెందిన గుండెబోయిన మహేశ్ ఆయన భార్య అపర్ణకు సంబంధించి విడాకుల కేసు గత రెండేళ్ల నుంచి కోర్టులో కొనసాగుతోంది. ఈ క్రమంలో అపర్ణ కుటుంబసభ్యులు మ్యాదరబోయిన రాజేందర్, మ్యాదరబోయిన రాజ్‌కుమార్, రవి ఈనెల 1న రాయపురలోని మహేశ్ ఇంట్లోకి చొరబడి వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు మనుషులపై దాడి చేశారు. బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు వరం.. బీసీ గురుకులం..



ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎంజేపీ కళాశాలలో విద్యార్థులకు పాఠాన్ని బోధిస్తున్న లెక్చరర్

- ఇంటర్‌లో ఉచిత వసతి, విద్య
- ఐఐటీ, నీట్, ఎంసెట్‌లో శిక్షణ
- 'సూపర్-100' పేరుతో ప్రత్యేక కోచింగ్
- బీసీలకు 75 శాతం సీట్లు రిజర్వు
- ఉమ్మడి జిల్లాలో 29 కళాశాలలు 2,480 సీట్లు
- ప్రవేశ పరీక్ష కోసం 12వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

కేసముద్రం, ఏప్రిల్ 4 : పదో తరగతి పూర్తిచేసి.. ప్రతిభావంతులైన వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఇంటర్ విద్యను అందించేందుకు మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీటీబీసీ డబ్ల్యూ) ఆధ్వర్యంలో నిర్వహించే రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు వరంగా మారాయి. వెనుకబడిన తరగతుల విద్యార్థుల్లోని ప్రతిభకు వెలికితీస్తూ వారి బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వ గురుకుల కళాశాలలు బాటలు వేస్తున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, ఎంసెట్, నీట్ ప్రవేశపరీక్షల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యనందిస్తూ రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 29 మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాలలను రాష్ట్రప్రభుత్వం నెలకొల్పింది. వీటిలో 15 బాలురకు, 14 బాలికల కోసం ఏర్పాటు చేశారు. 2024-2025 విద్యా సంవత్సరానికి ఇంటర్ అడ్మిషన్ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు పదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రైవేటు కళాశాలలు, హాస్టళ్లలో ఫీజులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ గురుకులాల్లో చేర్పించేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సుల్లో ఆంగ్లమాధ్యమంలో విద్యతోపాటు ఉచితంగా భోజన, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. ప్రవేశపరీక్షలోని మార్కులు, రిజర్వేషన్లను అనుసరిస్తూ సీట్లను భర్తీ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,480 సీట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 29 మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల జూనియర్ కళాశాలల్లో 2480 సీట్లున్నాయి. వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఏడు కళాశాలల చొప్పున, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో ఐదు చొప్పున, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మూడు చొప్పున మొత్తం 29 కళాశాలలున్నాయి. ఈ 29 కళాశాలల్లో 15 బాలురకు, 14 బాలికలకు కేటాయించగా బాలురకు 1,360 సీట్లు, బాలికలకు 1,120 సీట్లు మొత్తం 2,480 సీట్లు ఉన్నాయి. ఈ గురుకులాల్లో బీసీలకు 75 శాతం సీట్లు కేటాయించగా ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5శాతం ఓసీ లేదా ఈ బీసీలకు 2శాతం, అనాథలకు 3 శాతం సీట్లు కేటాయించారు. ఆయా రిజర్వేషన్లలోనే 3శాతం దివ్యాంగులకు, 25 శాతం సీట్లను జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు కేటాయించారు. ప్రవేశ పరీక్షకు 2024లో పదో తరగతి రెగ్యులర్‌లో పూర్తి చేసిన వారే అర్హులు. గతంలో పాసైన వారు, సప్లిమెంటరీ రాసిన వారు ప్రవేశానికి అనర్హులుగా పరిగణిస్తున్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలోని జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణం

గురుకుల కళాశాలల ప్రత్యేకతలు, సౌకర్యాలివే..

- కళాశాలల్లో ఉచిత విద్యతోపాటు వసతి, భోజనం
- ఆంగ్ల మాధ్యమంలోనే బోధన
- ప్రతీ తరగతి గదిలో డిజిటల్ క్లాసులు
- విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం.
- ఉదయం వ్యాయామంతో ప్రారంభించి 7.30 నుంచి 9గంటల వరకు బోధన కార్యక్రమాలు
- మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఆట స్థలాల సౌకర్యం
- ఉచిత బెడ్డింగ్ మెటీరియల్, యూనిఫాం, నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు
- కాస్మెటిక్ చార్జీల చెల్లింపు
- విద్యార్థులపై 24గంటల పాటు అధ్యాపకుల పర్యవేక్షణ
- ఇంటర్‌తో పాటు ఐఐటీ, నిట్, ఎంసెట్, నీట్‌లో శిక్షణ.
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేసి 'సూపర్-100' బ్యాచ్‌గా ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఐఐటీ, నీట్, ఎంసెట్‌లలో శిక్షణ.



ఎంజేపీ గురుకుల కళాశాల బాగుంది..

- సందిరి రవి, విద్యార్థి తండ్రి, కేసముద్రం స్టేషన్

మహబూబాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో నా కుమారుడు జగదీశ్వర్ ఇంటర్ సీఈసీ పూర్తి చేశాడు. నాణ్యమైన విద్య, బోధన ఈ కళాశాలలో అందుతాయి. పేద, మధ్య తరగతి వర్గాల తల్లిదండ్రులకు ఈ గురుకుల కళాశాలలు ఒక వరంగా మారాయి. ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..

- వై.మనోహర్‌రెడ్డి, ఆర్‌సీవో, ఎంజేపీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా

వెనుకబడిన తరగతుల విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో ఉచిత బోధన కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గత ఏడాది ఇంటర్ ప్రవేశపరీక్షను ఉమ్మడి జిల్లాలో 6 వేల మంది విద్యార్థులు రాశారు. ఈ గురుకులాల్లో అన్ని అర్హతలు గల లెక్చరర్లతో విద్యాబోధన ఉంటుంది. ఇంటర్‌తో పాటు ఎంసెట్, ఐఐటీ, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఉటుంది. మెరుగైన విద్యార్థులకు 'సూపర్-100' గ్రూప్‌కు ఎంపిక చేసి సీవోఈ కళాశాలలో ప్రత్యేకంగా ఐఐటీ, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు శిక్షణనిస్తారు.

జిల్లాల వారీగా కళాశాలలు..

ఉమ్మడి జిల్లాల్లోని జనగామ జిల్లాలో బచ్చన్నపేటలో బాలికలు, బాలురకు వేర్వేరు గురుకులాలున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లో బాలురు, రఘునాథపల్లిలో బాలికలు, మొండ్రాయిలో బాలికలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొగుళ్లపల్లిలో బాలురు, గాంధీనగర్ ఘన్‌పూర్‌లో బాలికలు, భూపాలపల్లిలో బాలురు, ములుగు జిల్లా వెంకటాపురంలో బాలురు, పాకాల కొత్తగూడలో బాలికలు, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో బాలికలు, గుమ్మడూరులో బాలురు, పెద్దవంగరలో బాలురు, పెద్దగూడూరులో బాలికలు, దంతాలపల్లిలో బాలురు, వరంగల్ జిల్లా నెక్కొండలో బాలికలు, నల్లబెల్లిలో బాలురు, సంగెంలో బాలురు, వరంగల్‌లో బాలికలు, ఖిలా వరంగల్‌లో బాలురు, తిమ్మాపూర్‌లో బాలికలు, వర్ధన్నపేటలో బాలికలు, హన్మకొండ జిల్లా శాయంపేటలో బాలురు, ఆత్మకూరులో బాలికలు, హన్మకొండలో బాలురు, కాజీపేటలో బాలికలు, ఐనవోలులో బాలురు, కమలాపూర్‌లో బాలురు, బాలికలకు వేర్వేరుగా కళాశాలలున్నాయి.

బాలికను వేధించిన యువకుడి అరెస్టు

శాయంపేట(హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : ప్రేమపేరుతో ఓ బాలికను వేధింపులకు గురిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. కొప్పులకు చెందిన పసుల శివరాజ్ ఓ బాలికను నెలరోజులుగా ప్రేమపేరుతో వేధిస్తున్నాడని చెప్పారు. ఈక్రమంలో ఈనెల 2న రాత్రి గ్రామంలో కిరాణంషాపుకు వెళ్తున్న బాలికను వేధించాడు. దీంతో ఆ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయడంతో శివరాజ్‌పై కేసు నమోదు చేశారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

110 ఏళ్ల అమ్మకు అన్నీ తానై..

ఆస్తుల్లేకపోయినా సాకుతున్న వృద్ధురాలు



తల్లితో కూతురు వెంకటమ్మ

నర్సంపేట టౌన్, మార్చి 4 : ఆస్తులు లేవు.. పనులు చేసుకునేందుకు సత్తువ లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే వృద్ధాప్య పింఛనే ఆసరాగా నూరేళ్ల వయసుపైబడిన తల్లిని సాకుతోంది 80ఏళ్ల వృద్ధురాలు. ఆరోగ్యం సహకరించకపోయినా, ఓ కన్ను కనిపించకపోయినా కని పెంచిన అమ్మ బాగోగులు చూస్తోంది. ఆస్తులు పంచి ఇచ్చిన తల్లిదండ్రులను కూడా వదిలేస్తున్న వారున్న ప్రస్తుత పరిస్థితుల్లో కష్టాలెన్ని ఎదురైనా తల్లిని కంటికిరెప్పలా కాపాడుకుంటోంది నర్సంపేట మండలం జీజీఆర్ పల్లె గ్రామానికి చెందిన నానబోయిన వెంకటమ్మ. దీనికి సంబంధించిన వివరాలివీ.. జీజీఆర్‌పల్లె గ్రామానికి చెందిన వేల్పుల మలమ్మకు 110 ఏళ్లు. మల్లమ్మ భర్త మల్లయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు కాగా వారికి వివాహాలయ్యాయి. ఓ కూతురును వేరే ఊరు ఇవ్వగా.. వెంటకమ్మను తమ స్వగ్రామంలోనే ఇచ్చారు. అయితే వెంకటమ్మ భర్త కూడా గతంలోనే మృతిచెందడం.. ఆమె ఇద్దరు కుమారులు కూడా వివాహాలై వేర్వేరుగా ఉంటుండగా వారి ఆర్థిక పరిస్థితి కూడా అంతంతమాత్రమే. ఈ క్రమంలో ఒంటరిగా ఉన్న వెంకటమ్మ.. 110ఏళ్ల పైబడిన తల్లి మల్లమ్మను ఒంటరిని చేయకుండా తనకున్న గుడిసెలోనే ఉంచి సపర్యలు చేస్తోంది. అయితే వెంకటమ్మ వయసు 80 సంవత్సరాలు కాగా ఆరోగ్యం సహకరించకపోయినా.. ఓ కన్ను సరిగా కనిపించకపోయినా తల్లి ఆలనాపాలనా మాత్రం మరవలేదు. ఉండడానికి పూరిగుడిసె తప్ప ఎలాంటి ఆస్తులు, ఆదాయం లేకపోవడంతో తల్లీకూతుళ్లకు ప్రభుత్వం నుంచి వస్తున్న వృద్ధాప్య పింఛనుతోనే బతుకీడుస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, దాతులు తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

నేడు బాబు జగ్జీవన్‌రాం జయంతి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4: భారత తొలి ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం 116వ జయంతి వేడుకలను మార్చి5న శుక్రవారం ఉదయం నిర్వహిస్తామని కేయూ ఎస్సీఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ తుమ్మల రాజమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య కేంద్రం వద్ద గల బాబు జగ్జీవన్‌రాం కాంస్య విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తాని వెల్లడించారు. అనంతరం కేయూ సెనెట్ హాల్‌లో కంటెపవరీ ఇష్యూష్ ఆఫ్ ఇండియా సొసైటీ అనే అంశంపై జరిగే సదస్సులో మాజీ తెలంగాణ, ఏపీ హైకోర్టు జడ్జీ బి. చంద్రకుమార్ కీలక ప్రసంగం చేస్తారన్నారు.

రేగులగూడెం వాసికి డాక్టరేట్



కాటారం, ఏప్రిల్ 4: భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధి బూడిదపల్లి గ్రామానికి చెందిన పొన్న మహేష్‌కుమార్ డాక్టరేట్(డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) పట్టా సాధించారు. కాకినాడ జేఎన్‌టీయూ ద్వారా కంప్యూటర్ సైన్స్ ఆఫ్ ఇంజనీ రింగ్(సీఎస్ఈ) విభాగంలో డాక్టర్ ఫిలాసఫీ అవార్డు పొందారు. 'ఎఫీషియంట్ అప్రోచెస్ ఫర్ డ్రైవింగ్ హై యుటిలిటీస్ ఫ్రం డాటా స్ట్రీమ్స్' అనే సిద్ధాంత వ్యాసాన్ని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సమర్పించడంతో మహేష్ కుమార్ పీహెచ్‌డీ సాధించారు.



క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రోషోల ఫ్లెక్సీ



స్ప్రింగ్ స్ప్రీకి ముస్తాబైన నిట్ ప్రధాన గేట్ తోరణం

నేటి నుంచి నిట్‌లో వసంతోత్సవం

- మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించనున్న 'టెక్నోక్రాట్స్'
- సాయంత్రం ప్రారంభించనున్న డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి
- భావిభారత ఇంజనీర్ల కల్చరల్ ఫెస్ట్‌కు ముస్తాబైన ప్రాంగణం
- హాజరుకానున్న 10 వేలమంది విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : కాజీపేటలోని నిట్ ప్రాంగణంలో సందడి నెలకొననుంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు 'టెక్నోక్రాట్స్' సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు దుమ్మురేపనున్నారు. ఈ ఏడాది 'సృజనాత్మకత శక్తితో కూడిన పండుగను వాగ్దానం చేయడం, పాల్గొనే వారి గత పరిమితులను అధిగమించి వారిలో దాగిఉన్న శక్తిని బయటకు తీయడం (ఖుఖిఘూఎఘా)' అనే థీమ్‌తో వసంతోత్సవాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దారు. భావిభారత ఇంజనీర్లు సాంస్కృతిక సంబరాల్లో మునిగి తేలనున్నారు. ఈ స్ప్రింగ్‌స్ప్రీలో నిట్‌లోని విద్యార్థులతో పాటు మొత్తం 10 వేలమంది స్టూడెంట్స్ కేరింతలు కొట్టనున్నారు. నేడు సాయంత్రం నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని నిట్ స్టూడెంట్స్ డీన్ వెల్ఫేర్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షిస్తున్నారు.

స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమాలు ఇలా..

● మొదటి రోజు

అన్ సాల్వ్‌డ్ నుక్కడ్ నాటకం, నిట్ వరంగల్ గాట్ టాలెంట్, ఫిల్మ్ ట్రెజర్ హంట్, ఫిల్మ్ క్విజ్, కొరియో నైట్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ఫుడ్ హంట్‌తో పాటు ప్రోషోలో ప్రముఖ గాయకుడు హరిచరణ ఆధ్వర్యంలో చౌరస్తా బ్యాండ్ కార్యక్రమం ఉర్రూతలూగించనుంది.

రెండోరోజు..

నిట్ వరంగల్ సోలో ఐడల్, డైరెక్టర్స్ కట్, ఫిల్మ్‌క్విజ్, హంగ్‌గేమ్స్, ఫొటో పజిల్‌తో పాటు నకాష్ అజీజ్, లాహోర్ ద బ్లాక్ స్మిత్ బృందం ప్రోషోలో విద్యార్థులను తన్మయత్వంలో ముంచనున్నారు.

మూడోరోజు..


జనరల్ క్విజ్, డైరెక్టర్స్ కట్, సీపీఆర్ రిలేతో స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమం ముగియనుంది.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థినికి బంగారు పతకం




స్రవంతిని అభినందిస్తున్న డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పథకం సాధించిన వేలేర్ కేజీబీవీ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సీహెచ్. స్రవంతిని డీఈవో అబ్దుల్‌హై అభినందించారు. జీసీడీవో సునిత ఆధ్వర్యంలో బంగారు పతకం సాధించిన స్రవంతిని డీఈవో కార్యాలయంలో డీఈవో అబ్దుల్ హై పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. కాగా గత నెల 29 నుంచి ఏప్రిల్ 1 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు తరపున పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభను కనబరిచి బంగారు పతకాన్ని సాధించింది. జీసీడీవో సునిత, పీఈటీ కిరణ్మయి, ఎస్‌వో స్రవంతి, హనుమకొండ సాఫ్ట్‌బాల్ సెక్రెటరి తాబేటి రాజేందర్ తదతరులు స్రవంతిని అభినందించారు.



కాంస్య పతకం, ప్రశంసా పత్రం



సాంబమూర్తి

చిత్రకళలో సాంబమూర్తికి కాంస్య పతకం

కరీమాబాద్, ఏప్రిల్ 4 : రంగ్-23 2వ నేషనల్ వైడ్ ఆర్ట్ అండ్ పెర్ఫామెన్స్ కాంపిటీషన్‌లో ఉర్సు కుమ్మరివాడ ప్రాంతానికి చెందిన ఆవునూరి సాంబమూర్తి కాంస్య పతకం సాధించాడు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ వేడుకల సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ ఆధ్వర్యంలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రకళ పోటీలను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముంబాయిలోని వెర్సోవా వెల్ఫేర్ అసోసియేషన్ హైస్కూల్‌లో గత ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో నిర్వహించారు. సాంబమూర్తి 'సర్వాంతర్యామి భారత్' అనే సందేశం చిత్రాన్ని పోస్టు ద్వారా కాంపిటీషన్‌కు పంపించాడు. 40నుంచి 60 ఏళ్ల కేటగిరీలో ఆయనకు తృతీయ బహుమతిని లభించింది. నిర్వాహకులు సాంబమూర్తికి సమాచారం అందించి, కాంస్య పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని పోస్టుద్వారా పంపించగా గురువారం ఉదయం తనకు చేరినట్లు సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

అక్కంపేటలో తాగునీటికి కటకట

- వారం రోజులుగా ప్రజల ఇబ్బందులు
- వ్యవసాయ బావుల వద్దకు పరుగులు

ఆత్మకూరు (హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : మండుతున్న ఎండలకు ప్రజల దాహార్తిని తీర్చాల్సిన అధికారులు పత్తాలేకుండా పోవడంతో నల్లానీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో వారం రోజుల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ పగిలిందని గుంతలు తీయించారు. వారం రోజులు గడిచినా మరమ్మతులు చేయకపోవడంతో తాగునీరు లేక ప్రజలు వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకూడదని ప్రభుత్వం ఎన్నిసార్లు హెచ్చరించినా అధికారుల తీరు మారడం లేదు. పలుమార్లు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించాలని వేడుకుంటున్నారు. లేని పక్షంలో ఖాళీ బిందెలతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పట్టించుకోని అధికారులు..

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యతను ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో అధికారులు పత్తాలేకుండా పోవడంతో నీటి సమస్యను ఎవరు పరిష్కరించాలని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



మరమ్మతుల కోసం గుంత తవ్వి వదిలిన దృశ్యం

'బాలయేసు' విద్యార్థికి జాతీయ ర్యాంకు



బాలయేసు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చి సన్మానించిన ఫాదర్ దిలీప్‌కుమార్

దేవరుప్పుల, ఏప్రిల్ 4: మండలకేంద్రంలోని బాలయేసు పాఠశాలలో జనవరి 30న నిర్వహించిన యూనిఫైడ్ కౌన్సిల్ ఇంటర్‌నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్ 2023-24 టెస్ట్ ఫలితాలు గురువారం వెలుబడగా పలువురు విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి ర్యాంకులను సొంతం చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా 1,14,100మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, బాలయేసు విద్యార్థులు 30మంది రాశారు. ఇందులో 11మంది విద్యార్థులు ఆలిండియా లెవల్‌లో ర్యాంకులు సాధించారు. 7వ తరగతి చదువుతున్న వేల్పుల శ్రీనిధి ఆలిండియా 902, స్టేట్ లెవల్‌లో 84వ ర్యాంకు సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఫాదర్ దిలీప్‌కుమార్ సన్మానించగా కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ సరిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు.

అనంతరం జేసురాజ్ మాట్లాడుతూ యూనిఫైడ్ కౌన్సిల్ మొత్తం 16దేశాలలో విద్యార్థుల ప్రతిభా పాటవాలను నైపుణ్యాలను వెలికితీసే ఒక ఐఎస్ఓ9001 సర్టిఫైడ్ సంస్థ అని తెలిపారు. జాతీయ స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు ర్యాంకుల సాధించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు ర్యాంకులు సాధించడానికి కృషి చేసిన గణిత, సైన్స్ టీచర్లతో పాటు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాజా, మదన్‌మోహన్, మహేష్, కృష్ణ, మాధవి, అనిత, సరిత, ఉషశ్రీ, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ



అంకిత్‌కుమార్

జనగామ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జనగామ ఏసీపీగా ఐపీఎస్ అధికారి అంకిత్‌కుమార్ శంఖ్వార్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఎన్నికల బదిలీల నేపథ్యంలో గ్రేహౌండ్స్ కమాండర్‌గా ఉన్న అంకిత్‌కుమార్‌ను ప్రభుత్వం జనగామ ఏసీపీగా బదిలీ చేసింది. ఆయన ఏఎస్పీ హోదాలో ఏసీపీగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టర్, డీసీపీని మర్యాదపూర్వకంగా కలిశారు.

శిథిలావస్థకు చేరిన భవనాల పరిశీలన

చిలుపూర్, ఏప్రిల్ 4 : శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన ప్రభుత్వ పాఠశాల భవనాలను పంచాయతీ రాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) చంద్రశేఖర్ పరిశీలించారు. గురువారం లింగంపల్లి, కొండాపూర్ గ్రామాలను సందర్శించిన ఆయన స్థానిక ఏఈ నరేష్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. తరగతి గదుల పటిష్టత విషయాలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొదటి దశ మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా గతంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో తగిన మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట నూతన భవనాలు, డైనింగ్ హాళ్ళు అధునాతన మూత్రశాలలు, సామూహిక మరుగుదొడ్ల నిర్మించామని, రెండో దశలో చేపట్టనున్న పనుల్లో భాగంగా పలు పాఠశాలలను సందర్శిస్తున్నామని, తగు నివేదికలను రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు.

అరూరి జన్మదిన వేడుకలు

జఫర్‌గడ్, ఏప్రిల్ 4 : బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం జఫర్‌గడ్‌లో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ ఆధ్వర్యంలో బర్త్‌డే కేక్ కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్, సింగారపు రమేశ్‌లు మాట్లాడుతూ జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అరూరి రమేశ్ విజయం కోసం ప్రతీ కార్యకర్త అకుంఠిత దీక్షతో పాటుపడాలని కోరారు. ప్రజలను చైతన్యవంతం చేస్తూ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు తిరుపతి, రాజు, సాయిరాం, మారెపల్లి రవి, ఇల్లందుల సారయ్య, బాబు, మేరుగు రామరాజు, సురేశ్, గాదెపాక శ్రీను, వెంకటయ్య, మేకల పవన్‌యాదవ్, నల్లతీగల చిరంజీవి, జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బెలిదె వెంకన్న, జడ్పీటీసీలు అజయ్ మణికంఠ, గుడి వంశీధర్‌రెడ్డి, బేబీ, ఎంపీపీ రేఖ

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 4: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్యను బలపరుస్తూ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో 1000 మంది కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారిలో లింగాలఘణపురం, జఫర్‌గడ్, రఘునాథపల్లి, ధర్మసాగర్ మండలాలకు చెందిన జడ్పీటీసీలు వంశీధర్ రెడ్డి, ఇల్లెందుల బేబీ-శ్రీనివాస్, బొల్లం అజయ్, పిట్టల శ్రీలత-సత్యనారాయణ, వేలేరు, చిలుపూర్, ఘన్‌పూర్, జఫర్‌గడ్ మండలాలకు చెందిన ఎంపీపీలు సమ్మిరెడ్డి, సరిత-బాలరాజు, కందుల రేఖ-గట్టయ్య, రడపాక సుదర్శన్‌లతో పాటు పీఏసీఎస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు నియోజకవర్గంలోని .70శాతం మేర ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారందరికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు.

రెండు కార్లు ఢీకొని ఒకరి మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- సింగరాజుపల్లి వద్ద ఘటన

దేవరుప్పుల, ఏప్రిల్ 4: జనగామ-సూర్యాపేట రహదారిపై దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. దేవరుప్పులకు చెందిన దాసగోని రంజిత్ మరో ఐదుగురు మిత్రులు కలిసి కారులో జనగామకు వెళ్లారు. ఓ పెళ్లి వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా సింగరాజుపల్లి టోల్‌గేట్ వద్ద ఎదురుగా వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ఆ కారులో హైదరాబాద్ మేడిపెల్లికి చెందిన గ్యార సాయికుమార్‌తోపాటు మొత్తం ఏడుగురు ఉన్నారు. వారు సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి పెళ్లికి వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

కాగా, ఈ ఘటనలో మేడిపల్లికి చెందిన గ్యార సాయికుమార్(27) అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు కార్లలో ప్రయాణిస్తున్న వారిలో బండ్ల ప్రవీణ్, దాసగోని రంజిత్, పాషాలకు తీవ్ర గాయాలయ్యాయి. దేవరుప్పుల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సాయికుమార్ మృతదేహంతో పాటు గాయపడిన వారిని 108వాహనాల్లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. దేవరుప్పుల ఎస్సై చెన్నకేశవులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద స్థలంలో మృతిచెందిన సాయికుమార్



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

'వేసవిలో ముందు జాగ్రత్తలు పాటించాలి'



పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

పాలకుర్తి, ఏప్రిల్ 4 : వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని కోరుతూ ప్రభుత్వ ఉన్నత శ్రేణి ఆస్పత్రిలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీవో రాములు మాట్లాడారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవి రాథోడ్, ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: వడదెబ్బ నుండి తప్పించుకోవాలంటే తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డా.హరికృష్ణ తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఇదే విషయమై మండల టాస్క్‌ఫోర్స్ సభ్యులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పానీయాలు, శీతల పానీయాలు సేవించవద్దని, తరుచూ మంచినీళ్ళు, కొబ్బరి నీళ్ళు, ఓఆర్ఎస్ తాగాలని సూచించారు. ఒకవేళ వడదెబ్బ తగిలితే ఆ వ్యక్తిని నీడలోకి తీసుకెళ్ళాలని, చాతిపై బట్టలు తొలిగించి చల్లని నీరు తాగించాలని, చల్లని నీటిలో ముంచిన బట్టతో కాళ్ళు తుడవాలని, చాతి, మెడపై ఐస్ ప్యాక్స్ ఉంచితే ఉపశమనం కలుగుతుందని తెలిపారు. తర్వాత వైద్యుని వద్దకు వెళ్ళాలని ఆయన వివరించారు. అనంతరం ఏడునూతుల, రామవరం, మండలకేంద్రంలోని ఎంపీడీవో , ఎంఆర్వో కార్యాలయాల్లో, పోలీస్‌స్టేషన్లో, పీహెచ్‌సీలో ఓఆర్ఎస్, ఐఈసీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ సిబ్బంది, ఎఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొమ్మూరి సమక్షంలో చేరికలు



కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌కు చెందిన జనగామ 30వ వార్డు కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్, పెంబర్తి మాజీ సర్పంచి అంబాల ఆంజనేయులుగౌడ్, నాయకులు బక్క ప్రవీణ్, జొన్నగాని కిష్టయ్య, గొల్లపల్లి మల్లేశ్‌గౌడ్, మల్లం శ్రీశైలం కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాను కప్పి కొమ్మూరి ఆహ్వానించారు. వీరితో పాటు జనగామ పట్టణం, జనగామ మండలం, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులైన కాంగ్రెస్‌లో చేరుతున్నామని అన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీని జనగామ నియోజకవర్గంలో మరింతగా బలోపేతం చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కష్టపడి పనిచేయాలని సూచించారు.

నీటికుంటలో పడి రైతు మృతి



కనకయ్య (ఫైల్)

బచ్చన్నపేట, ఏప్రిల్ 4: మండలంలోని కట్కూరు గ్రామంలో గుజ్జుల కనకయ్య (55) అనే రైతు నీటికుంటలో పడి మృతి చెందాడు. బుధవారం సాయంత్రం ఆయన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పంటలకు నీటి తడులు అందించేందుకు ఏర్పాటు చేసిన కుంట (సంప్)లో పడి మృతి చెందాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగిరాకపోయే సరికి కుటుంబ సభ్యులు వ్యవసాయ బావి వద్ద తిరిగిన ఫలితం లేకపోవడంతో తిరిగి గురువారం ఉదయం వెళ్లి పరిశీలిస్తుండగా కుంటలో చెప్పు తేలి ఉండటంతో అనుమానం వచ్చి నీటిని తోడి వేయగా మృతదేహం బయటపడింది. అయితే ఆయనకు ఫిట్స్ వచ్చేవని, దానివల్లే కుంటలో పడి మృతి చెంది ఉంటాడని కనకయ్య కుమారుడు ప్రశాంత్ పోలీసులకు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య రమాదేవి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

యువకుడిపై అత్యాచారం కేసు

లింగాలఘణపురం, ఏప్రిల్4: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై అత్యాచారానికి పాల్పడ్డ యాకూబ్ రెడ్డి అనే యువకుడిపై అత్యాచారం కేసుతో పాటుగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాకూబ్‌రెడ్డి అనే యువకుడు ఓ యువతిని ప్రేమ పేరిట నమ్మించి గర్భవతిని చేశాడు. అనంతరం విషయం బయటపడకుండా ఉండేందుకు ఆమెకు అబార్షన్ చేయించాడు. ఆ తర్వాత మరో యువతిని పెళ్లి చేసుకోవడంతో బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిపై ఎస్సీ ఎస్టీ అత్యాచారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సర్కార్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



పాలకుర్తిలో మాట్లాడుతున్న డీఆర్డీవో మొగులప్ప

పాలకుర్తి, ఏప్రిల్ 4 : సర్కార్ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఆర్‌డీవో మొగులప్ప అన్నారు. గురువారం ఎమ్మార్సీలో నిర్వహించిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాల బాధ్యులు, ప్రధానోపాధ్యాయులతో కలిపి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో జిల్లాలో 29 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వాటిలో ముఖ్యంగా తాగునీటి సౌకర్యం, మూత్ర శాలలు, మరుగు దొడ్ల నిర్మాణం, తగరతి గదుల మరమ్మతు పనులను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలే నిర్వహించానలి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య, ఆర్అండ్‌బీ డీఈ జీవన్‌కుమార్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహానికి ముసుగు వేసిన అధికారిని సస్పెండ్ చేయాలి



జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 4: జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ముసుగు వేసిన అధికారిని సస్పెండ్ చేయాలని కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ కేంద్ర ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక జగ్జీవన్ రామ్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని విగ్రహాలకు ముసుగు వేయాలి కానీ హైద్రాబాద్, సిద్దిపేట జిల్లాల్లో ఎక్కడా వేయకుండా కేవలం జనగామ లో మాత్రమే జగ్జీవన్ రామ్ విగ్రహానికి ముసుగు వేయడం పట్ల అధికారికి ఉన్న అత్యుత్సాహం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. తక్షణమే ఆ అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫొటో సాధన సమితి నాయకులు నీలం బాస్కర్, దళిత బహుజన సంఘాల నాయకులు జి.కృష్ణ, వజ్జ పరశురాములు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 4: జిల్లా కేంద్రం లోని ధర్మకంచ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్డులో తప్పులను సరి చేసుకోవడం కోసం జిల్లా, రాష్ట్ర, ఫోన్ నంబరు, ఇంటి నంబరు, పుట్టిన తేది మొదలగు తప్పొప్పులను సరి చేసుకోవచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. వివరాలకు 99129 77504, 81799 35749 నంబర్లలో సంప్రదించాలన్నారు. ప్రారంభ కార్యక్రమంలో సతీష్, తేజావత్ మోహన్ నాయక్, ఆపరేటర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

తరిగొప్పుల, ఏప్రిల్ 4: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామంలో రేయిన్‌బో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను బాల వికాస సీనియర్ మేనేజర్ కందుల ప్రతాప్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేయిన్‌బో యూత్ అధ్యక్షుడు అంకం రాజు, కందుల ప్రతాప్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరికీ ఫ్లోరైడ్ రహిత సురక్షిత మంచినీటిని అందజేయడమే లక్ష్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమిరిశెట్టి వీరేందర్, ఉపాధ్యక్షుడు జొన్నగోని రవీందర్, బాలవికాస కమిటీ సభ్యులు కందారపు సంపత్, నర్సింహులు, కేశం రమేష్, తాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు 'నిస్వార్థ' సాయం

నర్మెట, ఏప్రిల్ 4 : మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌కు నిస్వార్థ ఫౌండేషన్ సభ్యులు రూ.73,064 ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ప్రిన్సిపాల్ శరత్‌కుమార్ గురువారం తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పూర్వ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తూ నిస్వార్థ ఫౌండేషన్ స్థాపించి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే మోడల్ స్కూల్‌లో భారీ వర్షాల కారణాంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ మరమ్మతు కోసం ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి ప్రిన్సిపాల్ శరత్‌కుమార్, ఉపాధ్యాయ బృందం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆడపడుచు వివాహానికి ఆర్థిక సాయం

జఫర్‌గడ్, ఏప్రిల్ 4 : మండలంలోని తిమ్మంపేటకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఆడపడుచు వివాహానికి జఫర్‌గడ్ జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్ ఆర్థిక సాయం అందించారు. తిమ్మంపేటలో నాగారపు భాస్కర్ కుమార్తె స్వీటీ వివాహం కోసం రూ. 5 వేలు సాయం ప్రకటించి గ్రామస్థుల ద్వారా గురువారం అందజేశారు.

మాజీ సైనికుడి కూతురు వివాహానికి చేయూత

జనగామ కల్చరల్: జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన మాజీ సైనికుడు ఎన్. నరేందర్ కూతురు వివాహానికి హాజరైన సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ మాచర్ల భిక్షపతి ఆధ్వర్యంలో వివాహ కానుకగా రూ.20 వేలు అందజేశారు. రాష్ట్ర స్థాయిలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి సంక్షేమంలో భాగంగా వారి వారి కూతుర్ల వివాహానికి ఒక్కొక్కరు రూ.1000 జమ చేసి వారికి అందజేయాలని నిర్ణయించామని భిక్షపతి తెలిపారు.

ఘనంగా శ్రవణ నక్షత్ర హోమం

చిలుపూర్, ఏప్రిల్ 4 : శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ఘనంగా హోమపూజ నిర్వహించారు. ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, పూజారి సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య చేపట్టిన హోమపూజకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు, కృష్ణమాచార్యులు, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి - శంకరలక్ష్మి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



వెంకన్న ఆలయంలో హోమపూజ చేస్తున్న పూజారులు

మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా లక్ష్మి



రఘునాథపల్లి, ఏప్రిల్ 4: మహిళా కాంగ్రెస్ కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన పోరెడ్డి లక్ష్మిని నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అంకిత భావంతో కృషి చేస్తానని అన్నారు.

కెమిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడి కన్నుమూత

జనగామ కల్చరల్, ఏప్రిల్ 4: జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బుక్క రవీందర్ (60) కన్నుమూశారు. కొంతకాలంగా అస్వస్థతతో ఉన్న రవీందర్ హైద్రాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశారు. రవీందర్ మృతి పట్ల అసోసియేషన్ కార్యదర్శి దేవరాజ్, డి.లవకుమార్‌రెడ్డి, దోర్నాల వెంకటేశ్వర్లు తదితరులు సంతాపం ప్రకటించారు. అంత్యక్రియలు శుక్రవారం జనగామలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

222 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చిలుపూర్, ఏప్రిల్ 4 : మండలంలోని రాజవరం సమీపంలో అక్రమంగా లారీలో తరలిస్తున్న 222 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు, చిలుపూర్ ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల మేరకు.... గ్రామానికి చెందిన పతిరి ప్రభాకర్, మోటం రాజశేఖర్ అనే ఇద్దరు వ్యక్తులు గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో నిల్వఉంచిన పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేసుకుని వరంగల్ వైపు వెళ్తుండగా పట్టుకొని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. లారీతో పాటు, పలు వాహనాలను సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేశారు.

'జిజ్ఞాస' లో ఏబీవీ విద్యార్థుల ప్రతిభ

జనగామ కల్చరల్, ఏప్రిల్ 4: కళాశాల విద్యా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జిజ్ఞాస స్టూడెంట్ ప్రాజెక్టు - 2024' లో జిల్లా కేంద్రం లోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తెలుగు, ఇంగ్లీషు, మ్యాథమెటిక్స్ విభాగాలకు చెందన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక కాగా ఇటీవల హైద్రాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో ప్రదర్శన నిర్వహించారు. తెలుగులో 'మా డిగ్రీ తెలుగు పాఠాలు - మా జీవితపు వెలుగు బావుటాలు', ఇంగ్లీషులో 'బ్రీఫ్ స్టడీ ఆఫ్ ద సెలెక్టెడ్ నావెల్స్ ట్రాన్స్‌లేటెడ్ ఫ్రమ్ తెలుగు టు ఇంగ్లీష్', మ్యాథమెటిక్స్ లో 'ఆన్ ఇన్వెస్టిగేషన్స్ ఫిన్లర్స్ జామెట్రీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్' అంశాలపై ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో ఒక్క జనగామ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచే మూడు ప్రాజెక్టులు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ ఏ.నర్సయ్య తో పాటు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

బెల్ట్ షాపులపై దాడులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 4: బెల్టుషాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించి రూ.15వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక నగర్‌లో రూ.6400, పాలకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని నరసింగారావు తండాలో రూ.8180 విలువ కలిగిన మద్యంను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

చిలుపూర్, ఏప్రిల్ 4: రాబోయే వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ అన్నారు. గురువారం చిలుపూర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్ళి వివరించాలని కార్యకర్తలను కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో అరూరి రమేష్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీనివాస్, బాల్నె శ్రీనివాస్, ఊరడి రాజు, సాదం రామరాజు, దోరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రఘునాథపలి: మండలంలోని మండేలగూడెం గ్రామంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తిరుగుతూ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మంద వెంకటేషం, మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, నాయకులు గాదె ఉపేందర్, రాజ్‌కుమార్, అఖిల్, వల్లాల శ్రీను, అనిల్, రజనీకాంత్, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.